
డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
RNI NO: TGTEL/26/A0383
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR







| తెలంగాణ Telangana | గురువారం Thursday | 28 - 05 -2026 28- 05 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 133 Issue: 133 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## సీబీఎస్ఈ ఫలితాలపై
# రాహుల్ ఫైర్

జ్యుడీషియల్ విచారణకు డిమాండ్.
విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన.
కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు.

02



## ఈడీ వాహనాలపై
# దాడి

పినరయి నివాసం వద్ద ఉద్రిక్తత.
సీపీఎం కార్యకర్తల ఆగ్రహం.
పలువురికి గాయాలు.

02



## జూన్ 1 నుంచి బంకుల
# బంద్?

రాజస్థాన్‌లో పెట్రోల్ డీలర్ల సమ్మె.
వ్యాట్, ధరల పెరుగుదలపై ఆగ్రహం.
రవాణా వ్యవస్థపై ప్రభావం అవకాశం.



02

## ఎండలపై మోదీ
# హెచ్చరిక

ప్రజలకు కీలక సూచనలు.
వడదెబ్బ లక్షణాలపై అప్రమత్తం.
పలు రాష్ట్రాల్లో తీవ్ర వడగాల్పులు.

2 లో..



## గ్రామాలకు హైస్పీడ్
# ఇంటర్నెట్ లక్ష్యం

2

భారత్‌నెట్ అమలుపై సీఎం సమీక్ష.
కేంద్ర మంత్రితో వీడియో కాన్ఫరెన్స్.
టీ-ఫైబర్ విస్తరణకు చర్యలు.



# పోలీస్ కస్టడీకి భగీరథ్

మూడు రోజుల విచారణకు అనుమతి.
చర్లపల్లి జైలు నుంచి తరలింపు.
కీలక వివరాలపై దర్యాప్తు.



**జనం వాయిస్, హైదరాబాద్, మే 27:**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కేసులో మరింత లోతుగా విచారణ జరిపేందుకు పోలీసులు కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఉదయం చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని బండి భగీరథ్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం భారీ భద్రత మధ్య పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కేసు విచారణను కూకట్‌పల్లి డీసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు ఇప్పటికే మరిన్ని సెక్షన్లు చేర్చినట్లు సమాచారం.
దీంతో ఈ మూడు రోజుల పోలీస్ కస్టడీ విచారణ కీలకంగా మారి - మిగతా 2 లో...

# లక్ష ఇళ్లకు శ్రీకారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.
పేదల సొంతింటి కలకు ఊతం.
నగరంలో స్థలాల పరిశీలన.
వేగంగా గృహ నిర్మాణ ప్రణాళికలు.



**జనం వాయిస్, హైదరాబాద్, మే 27:**

రాష్ట్రంలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తొలి విడతలో హైదరాబాద్ నగరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న నివాస సమస్యను దృష్టిలో ఉంచుకుని పేదలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ద్వారా వేలాది కుటుంబాలకు స్థిరమైన నివాస భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కలిసి నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ పర్యటనలో పలు ప్రభుత్వ భూములు, ఖాళీ ప్రదేశాలను పరిశీలిస్తూ భవిష్యత్ గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలపై అధికారులతో చర్చించారు. నగరంలో అందుబాటులో ఉన్న భూములను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు ఇళ్లను అందించాలనే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలతో పాటు కాలదేరా, గడ్డియన్నారం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను కూడా పరిశీలించారు. ప్రస్తుతం
వినియోగంలో లేని ప్రభుత్వ భూములు, పాడుబడిన భవనాలను - మిగతా 2 లో...



# ప్రజా రవాణా బలోపేతం

కాలుష్య నియంత్రణకు చర్యలు.
ప్రజా రవాణా బలోపేతం.
మంత్రి పొన్నం ప్రభాకర్.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 27:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బస్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ఈవీ బస్సులను రోడ్లపైకి పంపించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా ప్రజలకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 960 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, అందులో హైదరాబాద్ నగరంలోనే 545 ఈవీ బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఇంటర్‌సిటీ సేవల కింద 580 బస్సులు నడుస్తున్నాయని వెల్లడించారు. మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తం 3,000 ఎలక్ట్రిక్ బస్సులు అమల్లోకి వస్తే 600 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ మరో ఢిల్లీలా కాలుష్య నగరంగా మారకుండా ఉండేందుకే ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ప్రజా రవాణాపై తీవ్రంగా ఉంటోందని, దీనికి
ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ బస్సులు మంచి - మిగతా 2 లో...

# తడిసిన ధాన్యంపై ఆగ్రహం

కొనుగోలు కేంద్రాల్లో హరీశ్ పర్యటన.
రైతులకు భరోసా ఇచ్చిన బీఆర్ఎస్.
కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు.





2

# ఎండలపై కవిత హెచ్చరికలు



కార్మికులు అప్రమత్తంగా ఉండాలి.
రైతులకు జాగ్రత్తల సూచనలు.
ప్రభుత్వానికి ప్రత్యేక విజ్ఞప్తి.

02

## సీబీఎస్ఈ ఫలితాలపై రాహుల్ ఫైర్

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 27:**
సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ అంశంపై స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఫలితాల్లో జరిగిన తప్పుల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. సీబీఎస్ఈ ఫలితాల్లో జరిగిన తప్పులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయని రాహుల్ గాంధీ అన్నారు. చాలా మంది విద్యార్థులకు తప్పుడు మార్కులు రావడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై జవాబుదారీగా వ్యవహరించడం లేదని రాహుల్ విమర్శించారు. సీబీఎస్ఈ ఫలితాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని అన్నారు. వేగంగా విచారణ పూర్తి చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా పత్రాల మూల్యాంకనం నిర్వహించిన 'సీవోఈఎంపీటీ' సంస్థపై కూడా రాహుల్ ఆరోపణలు చేశారు. గతంలో తెలంగాణలో 'గ్లోబ్ ఎరేనా' పేరుతో ఈ సంస్థ పరీక్షల మూల్యాంకనం నిర్వహించిందని పేర్కొన్నారు. ఫలితాల ప్రక్రియలో పారదర్శకతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రమాదకరమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఫలితాల్లో జరిగిన పొరపాట్ల వల్ల విద్యార్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ ఫలితాలపై ఇప్పటికే పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కుల విషయంలో లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ వివరణ కోరుతున్నారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది.

# గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ లక్ష్యం

**జనం వాయిస్, హైదరాబాద్, మే 27:**
తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకోవడంతో పాటు పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తో చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ వరకు రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసే అంశంపై స్పష్టమైన విధానం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హైస్పీడ్



ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంపై విస్తృతంగా చర్చించారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జ్యోతిరాదిత్య సింధియా హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రయోజన సంస్థను ఏర్పాటు చేసి కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనను కూడా వెల్లడించింది. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ విధానంతో టీ-ఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరించి ప్రతి గ్రామ పంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ విధానంలో అనుసంధానించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు కొనసాగేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు నిరంతర బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తొలి దశలో నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరించనున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఫైబర్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు కూడా పట్టణాల స్థాయి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కె. రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని అధికారులు అభిప్రాయపడ్డారు

## ఈడీ వాహనాలపై దాడి

**జనం వాయిస్, తిరువనంతపురం, మే 27:**
కేరళ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ అద్దెకు ఉంటున్న నివాసం వద్ద బుధవారం ఈడీ అధికారుల వాహనాలపై దాడి జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు ముగించుకుని బయలుదేరుతున్న సమయంలో సీపీఎం కార్యకర్తలు, సానుభూతిపరులు వాహనాలను అడ్డగించి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. సీఎంఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఆర్థిక లావాదేవీల కేసుకు సంబంధించి ఈడీ అధికారులు పినరయి విజయన్ నివాసంలో సోదాలు నిర్వహించారు. సోదాలు పూర్తయ్యాక అధికారులు తమ కాన్వాయ్‌లో బయలుదేరగా అక్కడ పెద్ద సంఖ్యలో గుమిగూడిన సీపీఎం కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. ఆగ్రహంతో కర్రలు, రాళ్లతో వాహనాలపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఒక డ్రైవర్ కంటికి గాజు పెంకులు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. మరో డ్రైవర్‌తో పాటు కొందరు కేంద్ర భద్రతా సిబ్బంది, పోలీసులు కూడా స్వల్ప గాయాలపాలైనట్లు సమాచారం. అక్కడ సీపీఎం సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ ఈ ఘటన జరగడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఘటన సమయంలో పోలీసులు మొదట ప్రేక్షకపాత్ర వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఈడీ అధికారులు అక్కడి నుంచి బయటపడి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అనంతరం పోలీసులు అప్రమత్తమై దాడికి పాల్పడిన వారిపై చర్యలు ప్రారంభించారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్ట్ చేయడం ప్రారంభించగా కొందరు కార్యకర్తలు సమీపంలోని పార్టీ కార్యాలయంలోకి వెళ్లి దాక్కున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఆ కార్యాలయాన్ని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలో ఈ ఘటనతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ ఘటనపై వివిధ రాజకీయ పార్టీలు స్పందిస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలపై దాడులు చేయడం సరికాదని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు సీపీఎం వర్గాలు మాత్రం ఈడీ చర్యలను రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తున్నట్లు సమాచారం.

## పోలీస్ కస్టడీకి భగీరథ్

- మొదటిపేజీ తరువాయి...



ంది. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు, ఆధారాలు సేకరించే దిశగా అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు నిందితుడిని వివిధ కోణాల్లో ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేసులో ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. డిజిటల్ ఆధారాలు, కాల్ డేటా, ఇతర సాంకేతిక వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయ వర్గాల్లోనూ దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి పూర్తి వివరాలు వెలుగులోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కోర్టు అనుమతితో కొనసాగుతున్న ఈ కస్టడీ విచారణలో కీలక విషయాలు బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక పోలీసులు కోర్టుకు సమగ్ర నివేదిక సమర్పించనున్నారు. కేసుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై అందరి దృష్టి నెలకొంది.

## ప్రజా రవాణా బలోపేతం

- మొదటిపేజీ తరువాయి...

పరిష్కారమని పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల బస్సులు ఉండగా, అందులో 1,000 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని మంత్రి వెల్లడించారు. జంట నగరాల్లో రోజుకు 35 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల ట్రాఫిక్ తగ్గడమే కాకుండా కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో పలు సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. కొత్త నియామకాలు, కొత్త బస్సుల ప్రవేశంతో ఆర్టీసీ దేశంలోనే ఉత్తమ సంస్థగా నిలుస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి నెల రెండో మంగళవారం డీఎంలు, ఆర్ఎంలు, ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. త్వరలోనే ఆర్టీసీ సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, అనంతరం సంఘాల ప్రతినిధులతో సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 310 కోట్ల టికెట్లను వినియోగించుకున్నారని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు కేపీహెచ్‌బీలో కొత్త డిపో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా 5 ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేసేందుకు అధికారులకు సూచనలు ఇచ్చారు. ఇకపై కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఈవీ బస్సులు విస్తృతంగా నడుస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# లక్ష ఇళ్లకు శ్రీకారం

- మొదటిపేజీ తరువాయి...

ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చి గృహ నిర్మాణానికి ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరంలో అద్దె భారం భరించలేక ఇబ్బందులు పడుతున్న పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా ఉపాధి కోసం నగరానికి వచ్చే కుటుంబాలకు సురక్షితమైన నివాస వసతి కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఎల్ఐజీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన స్థలాల గుర్తింపు, ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే అధికారులు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలతో కూడిన సమగ్ర కాలనీలుగా ఈ గృహ సముదాయాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధికి అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, భవిష్యత్తులో మరిన్ని గృహ నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. నగరంలో పెరుగుతున్న జనాభా, నివాస అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. పేదలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే



ప్రభుత్వ అసలు లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## జూన్ 1 నుంచి బంకుల బంద్?


**జనం వాయిస్, జైపూర్, మే 27:**
రాజస్థాన్‌లో జూన్ 1 నుంచి పెట్రోల్ బంకులు నిరవధికంగా మూసివేస్తామని పెట్రోల్ డీలర్లు ప్రకటించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, నిర్వహణ ఖర్చులు, చమురు సంస్థల విధానాల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. రాజస్థాన్‌లోని పెట్రోల్ బంకుల యజమానులు, నిర్వాహకులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వాలు, చమురు సంస్థలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో వినియోగం తగ్గిపోతుండగా, మరోవైపు విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలు, భద్రతా ఖర్చులు భారీగా పెరిగాయని తెలిపారు. దీంతో బంకుల నిర్వహణ భారంగా మారిందని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రాజస్థాన్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని డీలర్లు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్ కారణంగానే ధరలు పెరిగాయని ఆరోపించారు. సరిహద్దు ప్రాంత ప్రజలు తక్కువ ధరల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఇంధనం కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల తమ అమ్మకాలు తీవ్రంగా పడిపోయాయని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. చమురు సంస్థలు కూడా డిమాండ్‌కు తగినంత సరఫరా చేయడం లేదని డీలర్లు ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో చాలా తక్కువగా ఇంధనం సరఫరా చేస్తున్నారని చెప్పారు. దీంతో వాహనదారులకు సరిపడా పెట్రోల్, డీజిల్ అందించలేకపోతున్నామని తెలిపారు. ఇంధనం అందక వాహనదారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యాట్ తగ్గించాలని డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలా చేస్తే ఇంధన ధరలు తగ్గి వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వం ఈ అంశంపై స్పందించడం లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి నాలుగు రోజుల గడువు ఇచ్చామని, అప్పటికీ స్పందన లేకపోతే జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులు మూసివేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మె అమల్లోకి వస్తే ప్రజా రవాణాతో పాటు సరుకుల రవాణాపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం కూడా ఉందని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, చమురు సంస్థలు ఈ సమస్యపై ఎలా స్పందిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# తడిసిన ధాన్యంపై ఆగ్రహం

**జనం వాయిస్, సిద్దిపేట, మే 27:**
సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు గోనపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీశ్ రావు సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులను ఓదారుస్తూ అధైర్యపడొద్దని, తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనకపోవడం వల్లే రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన టి హరీశ్ రావు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. వడ్లు, మక్కలు, సన్‌ఫ్లవర్, శనగలు, జొన్నల కొనుగోళ్ల విషయంలో రెండు ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నెపం నెడుతుంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇక్కడ ధర్నాలు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. ఎఫ్‌సీఐ లెవీ కోటా, ఎరువుల కోటాను కేంద్రం సకాలంలో ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులను గాలికి వదిలేసిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎరువులు, ధాన్యం కొనుగోళ్లలో ఎప్పుడూ ఇబ్బందులు రాలేదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు కాళేశ్వరం జలాలతో రైతులకు బంగారు పంటలు అందించారని గుర్తు చేశారు. సాధారణంగా రోహిణీ కార్తె నాటికి వడ్ల కొనుగోళు పూర్తవుతాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆన్‌లైన్ ట్యాగింగ్, కొత్త నిబంధనల పేరుతో నెలరోజులుగా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 80 శాతం వడ్లు కొనుగోలు చేశామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా సగం ధాన్యం కల్లాల్లోనే ఉందని అన్నారు. తడిసిన వడ్లు మొలకెత్తి పూర్తిగా పాడవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు బస్తాకు 43 కిలోలు పెట్టితేనే ధాన్యం దించుకుంటామని రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఏ-గ్రేడ్ వడ్లను కూడా బీ-గ్రేడ్‌గా నమోదు చేసి రైతులకు భారీ నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. క్వింటాకు తరుగు పేరుతో 3 నుంచి 5 కిలోల వరకు కోత విధిస్తూ రైతులపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. రవాణా, హమాలీ, ట్రాక్టర్ వెయిటింగ్ ఛార్జీలు కూడా రైతులే భరించాల్సి వస్తోందని విమర్శించారు. వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో లారీలు అందుబాటులో ఉండవని, కాబట్టి వారం రోజుల పాటు ఇసుక రవాణాను నిలిపివేసి ఆ లారీలను ధాన్యం రవాణాకు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇస్తుందా, లేక ఇసుక ఆదాయానికా అన్నది స్పష్టం చేయాలని ప్రశ్నించారు.

## ఎండలపై మోదీ హెచ్చరిక

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 27:**



దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజలకు జాగ్రత్తలు వివరించారు. మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. నిత్యం తగినంత నీరు తాగాలని నరేంద్ర మోదీ ప్రజలకు సూచించారు. తీవ్రమైన ఎండల ప్రభావం నుంచి తమను తాము కాపాడుకోవాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. ఇతరులకు సహాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల వద్ద పక్షులు, జంతువుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బ లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని ప్రధాని హెచ్చరించారు. తల తిరగడం, వికారం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినా, నీరసంగా కనిపించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలని సూచించారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తత ఒక ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటోందని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ వర్గాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాల్పుల సమయంలో బయట పనులు తగ్గించుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మే 29 నుంచి ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అప్రమత్తంగా ఉన్నాయి. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి అధికారుల సూచనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

# ఎండలపై కవిత హెచ్చరికలు

**జనం వాయిస్, హైదరాబాద్, మే 27:**
మారుతున్న వాతావరణ పరిస్థితులతో రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎండల ప్రభావంతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొనే వర్గాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు, గిగ్ వర్కర్స్, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తీవ్రమైన ఎండల కారణంగా ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని కవిత హెచ్చరించారు. రోజంతా బయట పనిచేసే వారు తరచూ నీరు తాగడం, అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే వేళల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు ఎండల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని ఆమె తెలిపారు. పొలాల్లో పనిచేసే సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తలకు గుడ్డ కట్టుకోవడం, నీడ ఉన్న ప్రాంతాల్లో విశ్రాంతి తీసుకోవడం, శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. గిగ్ వర్కర్స్, డెలివరీ సిబ్బంది, ఆటో, క్యాబ్ డ్రైవర్లు నిరంతరం రోడ్లపై తిరగాల్సి వస్తుందని కవిత అన్నారు. ఈ వర్గాల ప్రజలు ఎండల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. అవసరమైనప్పుడు వైద్య సలహాలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కూడా ఎండల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కవిత కోరారు. ప్రజలకు తాగునీటి సౌకర్యాలు, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులు, రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. కుటుంబ సభ్యులు, చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



RNI NO:TGTEL/26/A0383
జనం వాయిస్ తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# సంపాదకీయం

## ఆకలి లేని ప్రపంచం సాధ్యమేనా?

**అభివృద్ధి మధ్య పెరుగుతున్న ఆహార అసమానతలు.**
**ఒకవైపు వృథా.. మరోవైపు ఆకలి కేకలు.**
**మానవత్వానికి సవాల్‌గా మారుతున్న సమస్య.**

**జనం వాయిస్, డెస్క్, మే 27:**

ప్రపంచం సాంకేతికంగా ఎన్నో అద్భుత విజయాలు సాధిస్తోంది. అంతరిక్ష పరిశోధనల నుంచి కృత్రిమ మేధస్సు వరకు మనిషి సామర్థ్యం రోజురోజుకు విస్తరిస్తోంది. కానీ అదే సమయంలో ప్రపంచంలో కోట్లాది మంది ప్రజలు ఒకపూట భోజనం కోసం పోరాడుతున్న వాస్తవం మానవ సమాజానికి పెద్ద ప్రశ్నగా మారుతోంది. ప్రపంచ ఆకలి దినోత్సవం ప్రతి సంవత్సరం వచ్చి పోతున్నా ఆకలి సమస్య మాత్రం ఇంకా ప్రపంచాన్ని వెంటాడుతూనే ఉంది. అభివృద్ధి గణాంకాలు పెరుగుతున్నా పేదల కడుపు నిండని పరిస్థితి సమాజ అసమానతలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఆహారం అనేది ప్రతి మనిషి ప్రాథమిక హక్కు. కానీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు అది ఇంకా అందని వరంగానే మిగిలిపోతోంది. యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ప్రకృతి విపత్తులు ఆకలి సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఒకవైపు విలాసవంతమైన జీవనం కొనసాగుతుండగా మరోవైపు పిల్లలు ఆకలితో అలమటించడం మానవత్వానికే మచ్చగా మారింది. ఆహార కొరత కేవలం పేద దేశాల సమస్య మాత్రమే కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా పేద వర్గాలు పోషకాహారం లేక ఇబ్బందులు పడుతున్నాయి.

ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే ఆహారం మొత్తం చూస్తే ప్రతి మనిషికి సరిపడా ఉంటుంది. అయినప్పటికీ సరైన పంపిణీ లేకపోవడం వల్ల కోట్లాది మంది ఆకలితో జీవిస్తున్నారు. ఒకవైపు హోటళ్లలో, వేడుకల్లో టన్నుల కొద్దీ ఆహారం చెత్తబుట్టల్లో పడుతుంటే మరోవైపు పేదవాళ్లు ఆకలితో రాత్రులు గడపడం బాధాకరం. ఆహార వృథా ప్రపంచవ్యాప్తంగా పెద్ద సమస్యగా మారింది. మనిషి అవసరానికి మించి వినియోగించడం కూడా ఈ పరిస్థితికి కారణమవుతోంది. ఆహారం విలువను సమాజం మళ్లీ గుర్తించాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో



పోషకాహార లోపం పెరగడం భవిష్యత్తు తరాలకు ప్రమాద సంకేతంగా మారుతోంది. సరైన ఆహారం అందక చాలా మంది చిన్నారులు ఎదుగుదలలో వెనుకబడుతున్నారు. బలహీనత, రక్తహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు పిల్లల జీవితాలపై దీర్ఘకాల ప్రభావం చూపుతున్నాయి. ఒక దేశ భవిష్యత్తు పిల్లల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. అలాంటి పరిస్థితిలో పిల్లలు ఆకలితో బాధపడటం సమాజ వైఫల్యంగానే చూడాలి.

వ్యవసాయ రంగం బలహీనపడటం కూడా ఆహార భద్రతపై ప్రభావం చూపుతోంది. రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ పంటలు పండిస్తున్నా సరైన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పులు, వర్షాభావం, సాగు వ్యయాల పెరుగుదల రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రైతు బతికితేనే ఆహార భద్రత సాధ్యమవుతుంది అనే నిజాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఆకలి నిర్మూలన గురించి మాట్లాడటం పూర్తి పరిష్కారం కాదు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు కొంత ఉపశమనం కల్పిస్తున్నా ఇంకా చాలా మంది అవసరమైన ఆహారం పొందలేకపోతున్నారు. ఆహార పంపిణీ వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం, అవినీతి, నిర్లక్ష్యం వంటి కారణాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. కేవలం పథకాలు ప్రకటించడం సరిపోదు. అవి నిజంగా అర్హులకు చేరుతున్నాయా అనే విషయాన్ని కూడా సమీక్షించాలి. ఆకలి సమస్యను రాజకీయాలకతీతంగా చూడాల్సిన అవసరం ఉంది.

సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఇంట్లో మిగిలిపోయే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి అందించే సంస్కృతి పెరగాలి. యువత సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ అనేక ప్రాంతాల్లో ఆహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం ఆశాజనక పరిణామం. చిన్న సహాయం కూడా ఎవరికో ఒకరికి పెద్ద ఉపశమనం కావచ్చు. ఆకలి బాధను అర్థం చేసుకునే మనసు సమాజంలో పెరిగితేనే మార్పు సాధ్యమవుతుంది. ప్రపంచ ఆకలి దినోత్సవం కేవలం ఒక రోజు నిర్వహించే కార్యక్రమంగా మిగిలిపోకూడదు. ప్రతి మనిషికి ఆహారం అందే వరకు ఈ పోరాటం కొనసాగాలి. ఆకలి లేని ప్రపంచం నిర్మించడం అసాధ్యం కాదు. కానీ అందుకు ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి బాధ్యతగా వ్యవహరించాలి. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, సాంకేతికత కాదు. ప్రతి మనిషి కడుపు నిండే పరిస్థితి ఏర్పడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇంట్లో మిగిలిపోయే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి అందించే సంస్కృతి పెరగాలి. యువత సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ అనేక ప్రాంతాల్లో ఆహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం ఆశాజనక పరిణామం. చిన్న సహాయం కూడా ఎవరికో ఒకరికి పెద్ద ఉపశమనం కావచ్చు. ఆకలి బాధను అర్థం చేసుకునే మనసు సమాజంలో పెరిగితేనే మార్పు సాధ్యమవుతుంది. ప్రపంచ ఆకలి దినోత్సవం కేవలం ఒక రోజు నిర్వహించే కార్యక్రమంగా మిగిలిపోకూడదు. ప్రతి మనిషికి ఆహారం అందే వరకు ఈ పోరాటం కొనసాగాలి. ఆకలి లేని ప్రపంచం నిర్మించడం అసాధ్యం కాదు. కానీ అందుకు ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి బాధ్యతగా వ్యవహరించాలి. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, సాంకేతికత కాదు. ప్రతి మనిషి కడుపు నిండే పరిస్థితి ఏర్పడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

# సావర్కర్ సేవలు చిరస్మరణీయం

**స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర.**
**దేశభక్తికి ప్రతీకగా నిలిచిన విప్లవకారుడు.**
**యువతకు స్ఫూర్తిగా మారిన జీవితం.**

**జనం వాయిస్, డెస్క్, మే 27:**

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో వినాయక దామోదర్ సావర్కర్ పేరు ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. మే 28 ఆయన జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు నాయకులు, చరిత్రకారులు, సామాజిక సంస్థలు ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ విప్లవకారుల్లో సావర్కర్ ఒకరిగా గుర్తింపు పొందారు. దేశభక్తి భావజాలాన్ని ప్రజల్లో నింపేందుకు ఆయన చేసిన కృషి ఇప్పటికీ చర్చనీయాంశంగానే నిలుస్తోంది. మహారాష్ట్రలో జన్మించిన సావర్కర్ చిన్న వయసు నుంచే దేశభక్తి భావాలతో ఎదిగారు. విద్యార్థి దశలోనే బ్రిటిష్ పాలనపై వ్యతిరేక భావజాలాన్ని ప్రచారం చేస్తూ యువతను చైతన్యపరిచారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ భావాలను వ్యాప్తి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విదేశాల్లో చదువుకుంటున్న సమయంలో కూడా భారత స్వేచ్ఛ కోసం ఉద్యమాలను కొనసాగించారు. బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు భావజాలాన్ని పెంచేందుకు పలు రచనలు చేశారు. సావర్కర్ రచించిన పుస్తకాలు యువతలో జాతీయ భావజాలాన్ని పెంపొందించాయని చరిత్రకారులు చెబుతున్నారు. ముఖ్యంగా భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రపై ఆయన రాసిన రచనలు అప్పట్లో పెద్ద చర్చకు దారితీశాయి. బ్రిటిష్ పాలకులు ఆయన కార్యకలాపాలను



ప్రమాదకరంగా భావించి అరెస్టు చేశారు. అనంతరం అండమాన్ సెల్యులర్ జైలుకు తరలించి కఠిన శిక్షలు విధించారు. జైలు జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన తన ధైర్యాన్ని కోల్పోలేదని చరిత్ర చెబుతోంది. అండమాన్ జైలులో గడిపిన కాలం సావర్కర్ జీవితంలో అత్యంత కఠినమైన దశగా నిలిచింది. అక్కడ ఖైదీలపై అమానుషంగా వ్యవహరించేవారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ దేశ స్వాతంత్ర్యం కోసం తన పోరాటాన్ని కొనసాగించాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగారు. జైలు గోడల మధ్య కూడా కవితలు, రచనలు చేస్తూ సహచర ఖైదీలలో ధైర్యం నింపారని చెబుతారు. ఆయన జీవితం త్యాగం, పట్టుదల, దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సావర్కర్ కేవలం విప్లవకారుడిగానే కాకుండా గొప్ప రచయితగా కూడా గుర్తింపు పొందారు. సమాజంలో జాతీయ చైతన్యం పెంపొందించేందుకు ఆయన పలు ప్రసంగాలు, రచనలు చేశారు. యువత దేశం కోసం పనిచేయాలని ఆయన ఎప్పుడూ పిలుపునిచ్చేవారని చరిత్రకారులు చెబుతున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించాలనే సందేశాన్ని ఆయన ఇచ్చారు. ఆయన ఆలోచనలు ఇప్పటికీ అనేక మందికి స్ఫూర్తినిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే సావర్కర్ భావజాలంపై వివిధ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఆయన రాజకీయ సిద్ధాంతాలపై ఇప్పటికీ దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. కొందరు ఆయనను గొప్ప దేశభక్తుడిగా కొనియాడుతుండగా మరికొందరు విమర్శాత్మకంగా చూస్తున్నారు. అయినప్పటికీ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్రను మాత్రం ఎవరూ విస్మరించలేరని చరిత్రకారులు పేర్కొంటున్నారు. భారత చరిత్రలో ఆయనకు ప్రత్యేక అధ్యాయం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం యువతకు సావర్కర్ జీవితం ఒక సందేశంగా నిలుస్తోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దేశం కోసం కష్టపడే తత్వం, ధైర్యం, సంకల్పం ఆయన జీవితంలో కనిపిస్తాయని చెబుతున్నారు. స్వేచ్ఛ కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల గురించి తెలుసుకోవడం ద్వారా యువతలో దేశభక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడే ఆలోచనలు పెంపొందుతాయని సూచిస్తున్నారు. వినాయక దామోదర్ సావర్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చిత్రపటాలకు నివాళులు అర్పిస్తూ సేవలను స్మరించుకుంటున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే దేశానికి స్వేచ్ఛ లభించిందని పలువురు నాయకులు గుర్తుచేస్తున్నారు. దేశ చరిత్రను గుర్తుంచుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.

# కాలుష్యం కమ్మేస్తున్న నగరాలు

**ఊపిరి తీసుకోవడమే సవాల్‌గా మారుతున్న పరిస్థితి.**
**పెరుగుతున్న వాహనాలు.. తగ్గుతున్న పచ్చదనం.**
**వాహనాల పొగతో పెరుగుతున్న ప్రమాదం.**
**పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం.**





**జనం వాయిస్, డెస్క్, మే 27:**

దేశంలోని ప్రధాన నగరాలు రోజురోజుకు కాలుష్య మబ్బుల్లో చిక్కుకుంటున్నాయి. వాహనాల పెరుగుదల, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ పనులు, చెత్త దహనం వంటి కారణాలతో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుతోంది. ఇటీవల విడుదలైన గాలి నాణ్యత సూచిక నివేదికల్లో ఢిల్లీ, నోయిడా, ఘాజియాబాద్, పట్నా వంటి నగరాలు అత్యంత కాలుష్య ప్రాంతాల జాబితాలో నిలిచాయి. గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితులను పలుమార్లు దాటుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. దీంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన అధ్యయనాలు మరింత ఆందోళన కలిగించే విషయాలను వెలుగులోకి తెచ్చాయి. ఇండో-గంగేటిక్ మైదాన ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు గత దశాబ్దంతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. మైదాన ప్రాంతాల్లోని కాలుష్యం ఇప్పుడు హిమాలయ ప్రాంతాలకు కూడా చేరుతోందని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన గాలికి ప్రసిద్ధి చెందిన కొండ ప్రాంతాలు కూడా ఇప్పుడు కాలుష్య ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. పర్యావరణ మార్పులు భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న కాలుష్య ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు శరీరంలోకి వెళ్లి దీర్ఘకాలిక అనారోగ్యాలకు దారితీస్తున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని నగరాల్లో ఉదయం వేళ బయటకు రావడమే ప్రమాదంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల పెరుగుదల నగర కాలుష్యానికి ప్రధాన కారణంగా మారింది. రోజురోజుకు రోడ్లపై వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో పొగ ఉద్గారాలు అధికమవుతున్నాయి. ట్రాఫిక్ రద్దీ కారణంగా గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడం కూడా గాలి నాణ్యతను మరింత దెబ్బతీస్తోంది. మరోవైపు నిర్మాణ పనుల వల్ల ఎగిసే ధూళి నగరాలను మరింత కలుషితం చేస్తోంది. చెత్తను బహిరంగంగా కాల్చడం వల్ల విషపూరిత వాయువులు గాలిలో కలుస్తున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణ కోసం పలు చర్యలు చేపడుతున్నప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రాష్ట్రాలు విద్యుత్ బస్సుల వినియోగాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. పరిశ్రమల ఉద్గారాల పర్యవేక్షణ, గాలి నాణ్యత కొలిచే కేంద్రాల పెంపు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అయితే నగరాల్లో పచ్చదనం తగ్గిపోవడం కూడా కాలుష్య సమస్యను మరింత పెంచుతోంది. చెట్ల సంఖ్య తగ్గిపోవడం వల్ల సహజ గాలి శుద్ధి ప్రక్రియ దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. కాలుష్యం కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు. ఇది ప్రజల జీవన ప్రమాణాలను కూడా ప్రభావితం చేస్తోంది. అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఉద్యోగుల పనితీరు తగ్గుతోంది. స్వచ్ఛమైన గాలి ప్రతి మనిషి హక్కు అనే విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. వాహనాల వినియోగం తగ్గించడం, మొక్కలు నాటడం, చెత్తను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి చిన్న చర్యలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

# రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహనే రక్షణ

**జనం వాయిస్, డెస్క్, మే 27:**



ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. మహిళల్లో నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. రుతుక్రమం మహిళల జీవితంలో సహజమైన శారీరక ప్రక్రియ అయినప్పటికీ ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో దీనిపై బహిరంగంగా మాట్లాడేందుకు సంకోచం కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలసరి గురించి సరైన సమాచారం లేకపోవడం వల్ల అనేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాజంలో నెలకొన్న అపోహలు, మూఢనమ్మకాలు మహిళల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మహిళలు ఇంకా సరైన రుతుక్రమ పరిశుభ్రత సౌకర్యాలకు దూరంగా ఉన్నారని పలు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, పరిశుభ్రత ఉత్పత్తులు అందుబాటులో లేకపోవడం వల్ల మహిళలు అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన బాలికలు సరైన శానిటరీ ఉత్పత్తులు కొనుగోలు చేయలేక పాత బట్టలు ఉపయోగించే పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో ఇన్ఫెక్షన్లు, చర్మ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నెలసరి సమయంలో పరిశుభ్రత పాటించకపోతే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. శానిటరీ ప్యాడ్లు లేదా ఇతర పరిశుభ్రమైన ఉత్పత్తులను సమయానికి మార్చడం చాలా అవసరమని సూచిస్తున్నారు. అలాగే చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రమైన నీటిని వినియోగించడం కూడా ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని వివరిస్తున్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది బాలికలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుతుక్రమం గురించి కుటుంబాల్లో బహిరంగ చర్చలు జరగకపోవడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. చాలామంది బాలికలు మొదటిసారి నెలసరి వచ్చినప్పుడు భయాందోళనలకు గురవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాలికలకు ముందుగానే సరైన సమాచారం అందిస్తే ఈ పరిస్థితి మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రుతుక్రమం సిగ్గుపడాల్సిన విషయం కాదని, అది సహజమైన శారీరక ప్రక్రియ అని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. పాఠశాలల్లో రుతుక్రమ ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని విద్యావేత్తలు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా బాలికలు నెలసరి సమయంలో పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోతున్నారని తెలుస్తోంది. సరైన మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలు లేకపోవడం కూడా దీనికి ఒక కారణమని పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు పాఠశాలల్లో పరిశుభ్రత సదుపాయాలు పెంచడంతో పాటు ఉచిత శానిటరీ ప్యాడ్ల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**మహిళల ఆరోగ్యానికి పరిశుభ్రతే రక్షణ.**
**అపోహలు తొలగించాల్సిన సమయం ఆసన్నం.**
**పరిశుభ్రత లేకపోతే పెరిగే ఆరోగ్య సమస్యలు.**

ప్రముఖులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు మహిళల ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత కూడా ఇప్పుడు ఈ అంశంపై బహిరంగంగా చర్చించడం ప్రారంభించిందని సామాజిక వేత్తలు చెబుతున్నారు. దీంతో నెలసరి గురించి ఉన్న పాత అపోహలు క్రమంగా తగ్గుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు కూడా మహిళల ఆరోగ్య రక్షణ కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు తక్కువ ధరలకు శానిటరీ ప్యాడ్లు అందించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆరోగ్య కార్యకర్తల ద్వారా ఇంటింటికి వెళ్లి మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా చాలా ప్రాంతాల్లో సరైన సదుపాయాలు అందుబాటులోకి రాలేదని మహిళా సంఘాలు చెబుతున్నాయి. ఆరోగ్య హక్కులను ప్రతి మహిళకు అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యంపై మరింత చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రుతుక్రమం గురించి అపోహలను పక్కనబెట్టి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాల్సిన సమయం వచ్చిందని చెబుతున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతి బాలిక భయపడకుండా, సంకోచించకుండా తన ఆరోగ్యాన్ని సంరక్షించుకునే పరిస్థితులు ఏర్పడితేనే ఈ దినోత్సవానికి అసలైన అర్థం నెరవేరుతుందని ఆరోగ్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

RNI NO:TGTEL/26/A0383
దైనిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM


## అంగన్వాడీ సెంటర్ రహదారిపై విస్తరించిన ముళ్ళచెట్టు.

### చిన్నారులు,బాలింతల ఇబ్బందులు

**చిగురుమామిడి మే27 (జనం వాయిస్):**
మండలంలోని ఇందుర్తి గ్రామంలోని 1వ వార్డులో అంగన్వాడీ సెంటర్-IIకు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక పెద్ద ముళ్ళచెట్టు పూర్తిగా విస్తరించి ఉంది. దీనివల్ల అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలతో పాటు సాధారణ ప్రయాణికులు,వాహనదారులు ప్రతిరోజూ భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు.



**తల్లిదండ్రులు, స్థానికుల ఆందోళన**
“రహదారిపైకి చొచ్చుకువచ్చిన ముళ్ల కొమ్మలు అంగన్వాడీకి వెళ్లే చిన్నపిల్లల కళ్లకు, ముఖాలకు తగిలే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, రోడ్డుపైకి వాలిన ఆ చెట్ల కొమ్మలపై నిరంతరం కోతులు గుంపులుగా ఉంటుండటంతో చిన్నారులు ఒంటరిగా వెళ్లడానికి తీవ్రంగా భయపడుతున్నారు.“

**పరిశుభ్రత నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**
ఈ ప్రమాదకరమైన సమస్యపై స్థానిక ప్రజలు పలుమార్లు గ్రామపంచాయతీలో పలుమార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.తక్షణమే స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం లేదా తీవ్ర గాయాలు అయ్యేలోపు, ఉన్నతాధికారులు, గ్రామపంచాయతీ సర్పంచ్ వెంటనే స్పందించి రహదారిపై విస్తరించిన ముళ్ళచెట్టును, కొమ్మలను పూర్తిగా తొలగించి, ఆ మార్గాన్ని ప్రయాణానికి అనుకూలంగా శుభ్రం చేయాలని ఇందుర్తి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులను సీజ్ చేస్తాం

### మంచిర్యాల డీటీఓ గోపికృష్ణ హెచ్చరిక

**జనం వాయిస్, మంచిర్యాల, మే 27:**
మంచిర్యాల జిల్లాలో రవాణా అర్హత పత్రం (ఫిట్‌నెస్) లేని విద్యాసంస్థల బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాటిని జప్తు (సీజ్) చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి గోపికృష్ణ స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల బస్సుల సామర్థ్య తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన మొత్తం 373 బస్సులు ఉన్నాయని తెలిపారు. అందులో ఇప్పటివరకు 110 బస్సులకు తనిఖీలు పూర్తి చేసి అర్హత పత్రాలు అందజేసినట్లు ఆయన వెల్లడించారు.

**ప్రతిరోజూ 30 బస్సుల పరిశీలన**
విద్యార్థుల భద్రతే ధ్యేయంగా రవాణా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రతిరోజూ 30 బస్సులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. బడులు తెరిచే లోపు జిల్లాలోని ప్రతి విద్యాసంస్థ తమ వాహనాలకు తప్పనిసరిగా రవాణా శాఖ పరీక్షలు చేయించుకుని, నిబంధనల ప్రకారం అర్హత పత్రం పొందాలని ఆదేశించారు. చట్టాన్ని అతిక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి తెచ్చే వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో జిల్లా రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు




## గార్లలో నెహ్రూ వర్ధంతి

### ఘనంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు.

**గార్ల /జనం వాయిస్ :**
భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా గార్లలో కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతీరామ్ నాయక్ మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నెహ్రూ విశేష కృషి చేశారని తెలిపారు. భారత భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే ఆయన ఆశయాలను యువత అనుసరించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య విలువలు, పారిశ్రామిక అభివృద్ధి, విద్యా విస్తరణ వంటి అంశాల్లో ఆయన వేసిన పునాదులు నేటి భారత అభివృద్ధికి బలమైన ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నవ భారతావనికి శాస్త్రీయ దృష్టి కల్పిస్తూ శాస్త్ర, సాంకేతిక ప్రగతికి నెహ్రూ పునాదులు వేశారని కొనియాడారు. దేశ పురోగతికి దూర దృష్టితో రూపొందించిన ప్రణాళికలు,పాటించిన ప్రజాస్వామ్య విలువలు, శాంతి,విజ్ఞాన సాంకేతిక రంగాల అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడెం సర్పంచ్ లు రామ్ సింగ్, కేలోత్ వీరన్న,జాతీయ స్త్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం, యాకుబ్ పాషా, గట్టు సాయన్న, ఐలయ్య, శ్రీకాంత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## సహారా డిపాజిట్లు వెంటనే చెల్లించాలి.

- లేదంటే ఆత్మహత్యలే శరణ్యం!
- కాలపరిమితి తీరినా పైసలివ్వడం లేదు..
- మంచిర్యాలలో సహారా బాధితుల ఆందోళన.
- ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి.



**జనం వాయిస్, మంచిర్యాల, (మే 27):**
మంచిర్యాల :.సహారా ఇండియా సంస్థలో తాము చేసిన ఫిక్స్ డిపాజిట్ల కాలపరిమితి ముగిసి 4-5 ఏళ్లు గడుస్తున్నా యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడంపై మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమావేశమైన బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది బాధితులకు సహారా యాజమాన్యం రూ. 1,40,000 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ. 5,000 కోట్లు మాత్రమే చెల్లించారని, మిగతా సొమ్మును వెంటనే చెల్లించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ/కూటమి) ప్రభుత్వం వెంటనే స్పందించి, ఢిల్లీలోని భారతీయ సెక్యూరిటీల ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) సంస్థతో సంప్రదింపులు జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఈ ఆందోళన, నిరసన సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సహారా బాధితులు పులి కృష్ణ, మురహరి, రమేష్, గంగయ్య, రాజన్న, చారి తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు తమ కష్టార్జితాన్ని సహారాలో దాచుకుని నేడు రోడ్డున పడ్డారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) శ్రీ గడ్డం వంశీకృష్ణ గారు స్థానిక ప్రజల కష్టాలను గుర్తించి, ఈ సహారా బాధితుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో ఈ విషయమై గళం విప్పి, తమకు రావాల్సిన మెచ్యూరిటీ డబ్బులు త్వరగా అందేలా చొరవ చూపి తమ ప్రాణాలను కాపాడాలని బాధితులు ఎంపీ గారిని సవినయంగా అభ్యర్థించారు

## నివాసాల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగల తొలగింపునకు మేయర్ ఉత్తర్వులు

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి (మే 27):**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్, శ్రీరాంపూర్ బస్టాండ్ మజీద్ వద్ద నివాసాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల సమస్యపై స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు మేయర్ ధర్ని మధుకర్ స్పందించి, తక్షణ పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరాంపూర్ బస్టాండ్ మజీద్ సమీపంలో నివాసాల పై నుండి వెళ్తున్న ఎల్.టి. లైన్ల వలన స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ దృష్టికి తీసుకువచ్చారు. మేయర్ మధుకర్ సంఘటనా స్థలానికి వెళ్లి నివాసాలను పరిశీలించి, సమస్యను అర్థం చేసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌తో ఫోన్ ద్వారా సంప్రదించి, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మేయర్ చొరవతో విద్యుత్ లైన్ల మార్పునకు చర్యలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ చర్యల వలన స్థానిక నివాసితులు భద్రతతో పాటు, విద్యుత్ సంబంధిత ప్రమాదాల నుండి ఉపశమనం పొందుతారని భావిస్తున్నారు. సమస్య పరిష్కారానికి మేయర్ చూపిన చొరవ పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, మేయర్ ధర్ని మధుకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి సుధాకర్, ఇతర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సత్తయ్య చేసిన సేవలు మరవలేనివి

### నగర కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి (మే 27):**
మంచిర్యాల:ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన మంచిర్యాల పట్టణ ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కీ.శే. అంకతి సత్తయ్య గారి సేవలు ఎనలేనివని మంచిర్యాల నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్ కొనియాడారు. మంచిర్యాలలో నిర్వహించిన సత్తయ్య గారి పెద్ద కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసప్తప్త కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. సత్తయ్య అకాల మరణం ఆటో కార్మిక రంగానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆటో అసోసియేషన్ ప్రతినిధులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## వరి కోయ్యలు వ్యర్థం కాదు నేలకి బంగారం.

వరి కోయ్యలు కాల్చొద్దు.
వరి కొయ్యలను కాల్చితే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.
రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించాలి.
కావటి రామారావు, మండల వ్యవసాయ అధికారి.

**గార్ల /జనం వాయిస్ :**
రైతులు పంట కోత తర్వాత వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు నత్రజని, ఫాస్పరస్, పోటాస్ వంటి ముఖ్య పోషకాలు నశిస్తాయని, వాన పాములు, సూక్ష్మజీవులు చనిపోతాయని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు అన్నారు.మండల పరిధిలోని శేరిపురం రైతు వేదికలో బుధవారం రైతులకు పంట మార్పిడి,పంట అవశేషాల కాల్చడం ద్వారా నష్టాలు, నానో యూరియా వాడకం వలన కలిగే ప్రయోజనాలపై సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని,పంట మార్పిడి విధానం పాటించడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని నేల సారవంతం అవుతుందని చీడ పీడలు వ్యాధులు తగ్గుతాయని, ఎరువుల ఖర్చు తగ్గుతుందని, నీటి వినియోగం తగ్గుతుందన్నారు.పంట దిగుబడులు స్థిరంగా వుంటాయని రైతు ఆదాయం పెరుగుతుందని పంట అవశేషాల నిర్వహణ సులభంగా ఉంటుందని కావున రైతులు మూస విధానం లో ప్రతి యేటా మిర్చి, వరి,ప్రత్తి, మొక్కజొన్న లకు బదులుగా ఆయిల్ పామ్, కూరగాయల సాగు, పప్పు దినుసులు సాగు కూడా చేపట్టడం ద్వారా భూమి సారవంతం అవుతుందసని తెలిపారు.పంట వ్యర్థలను ఎట్టి పరిస్థితి లో కాల్చడం చేయకూడదని,నేలలో కలియ దున్నడం ద్వారా నేలకు సేంద్రియ కార్బనం తొడవుతుందని, పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా నేల సారం తగ్గుతుందని పంటకు అవసరం ఐన సూక్ష్మ జీవులు నశిస్తాయని నేల గట్టిపడుతుందని వాయు కాలుష్యం పెరుగుతుంది అన్నారు.ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ఎరువుల ఖర్చు పెరుగుతుంది, పర్యావరణ మార్పులు జరుగుతాయని తెలిపారు. రైతులు గ్రామాలలో తిరిగి విత్తనాలు అమ్మే వారి దగ్గర విత్తనాలు కొని మోస పోవద్దని లైసెన్స్ కలిగిన అదీకృత డీలర్స్ వద్దనే విత్తనాలు కొని రసీదును పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరచు కోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్యలక్ష్మి, సర్పంచ్ భారతి, నేచురల్ ఫార్మింగ్ వాలంటీర్ శ్రీ చరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం: డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో కరపత్రాల విడుదల.
బస్టాండ్, రైల్వే స్టేషన్లలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు.

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి (మే 27):**
మంచిర్యాల:ఆరోగ్యవంతమైన, పొగాకు రహిత భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కార్యాలయంలో ఆమె ప్రత్యేక అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పొగాకు మహమ్మారి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. “పొగాకును విడిచిపెట్టండి - ఆరోగ్యకరమైన జీవితం గడపండి“ అనే ముఖ్య నినాదంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రజలందరూ భాగస్వాములై పొగాకు రహిత సమాజ స్థాపనకు సహకరించాలని ఆమె కోరారు.




## మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి వినయ్ ఆర్థిక సహాయం

**పాలకుర్తి మే 27 జనం వాయిస్:**
జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన విభాగం ముఖ్య నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, వారిని ఓదార్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ. 5,000 (ఐదు వేల రూపాయలు) తక్షణ ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ రావు మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్,వార్డు సభ్యులు మామిండ్ల కవిత శోభన్, కడుదుల కరుణాకర్ రెడ్డి, స్థానిక నాయకులు కమ్మగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన కోమటి రెడ్డి.

**జనం వాయిస్ అక్కన్నపేట, మే.27:**

కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి హుస్నాబాద్ నియోజకవర్గంలోని రైతుల సమస్యలను వివరించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం మరియు మిల్లర్ల వైఖరి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మొక్కజొన్న కొనుగోళ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రికి వివరించారు. నెల రోజులుగా మార్కెట్ యార్డుల్లో,ఐకేపి సెంటర్ లలో రైతులు పడిగాపులు కాస్తున్నప్పటికీ కనీసం గోనె సంచులు కూడా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను ప్రస్తావిస్తే ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని, రైతుల సమస్యల పరిష్కారానికి తగిన పోరాట కార్యక్రమాలు రూపొందించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. వీరితో పాటు అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తదితరులున్నారు.




# గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందించండి..!

**గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించండి.!!**
**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన బిఆర్ఎస్ సర్పంచులు.**
**అక్కన్నపేట సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, భూక్య కృష్ణ నాయక్.**

**జనం వాయిస్. అక్కన్నపేట, మే 27 :**

గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించి ప్రత్యేక నిధులు కేటాయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపే విధంగా కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ను అక్కన పేట బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ లు బుధవారం మినిస్టర్ క్వార్టర్స్ లో కలిశారు.అనంతరం అక్కన్నపేట మండల సర్పంచ్లు ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నటువంటి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని అంతే తప్ప వీరిలో వేరే ఉద్దేశం లేదని ఆయన అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం తోడ్పాటు అందించాలని, గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలనే ఉద్దేశంతోటి మంత్రి ని కలవడం జరిగిందని,అనేక గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్వాడి సెంటర్లకు కూడా పక్కా భవనాలు లేక పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అటు తండాలలో కూడా రోడ్ల సౌకర్యం సరిగ్గా లేదని వాటికి కూడా నిదులు కేటాయించాలని అన్ని విధాలుగా నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే గ్రామాలలో ఉన్న సమస్యలు తీర్చినట్లయితే మరింత ముందుకు వెళ్లే వీలుంటుందని అందుకు రాష్ట్ర మంత్రి పొన్నం ను కలవడం జరిగిందని కృష్ణ నాయక్ అన్నారు దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించాడని అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని హామీ ఇచ్చినట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కట్కూర్ సర్పంచ్ బాలరాజు, జనగాం సర్పంచ్ బొద్దు ఈశ్వర్,కేశవ్ నాయక్ తండా సర్పంచ్ లావుడియా సులోచన దేవన్ నాయక్,మాలోతు మనీ కనుక నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ స్థాయి కమిటీల బలోపేతంపై ఎం ఆర్ పి ఎస్ దృష్టి.

**ఎనగందుల లక్ష్మీనారాయణ ఎం ఆర్ పిఎస్ రాష్ట్ర కార్యదర్శి.**

**జనం వాయిస్, హుస్నాబాద్ మే.27:**

హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మాదిగ జాతీయ నాయకుడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద కుమార్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలో నూతన కార్యవర్గాల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు తెలిపారు. అలాగే హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మాదిగ వర్గం నుంచి గెలుపొందిన 17వ వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్, 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల సరూప రవీందర్, 9వ వార్డు కౌన్సిలర్ గడిపే సంపత్‌లను శాలువాలతో సన్మానించి అభినందించారు. హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ యూత్ అధ్యక్షులు ప్రకాష్ మాదిగతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# హుస్నాబాద్‌లో బెల్లి లలితక్క 27వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**జనం వాయిస్, హుస్నాబాద్ మే.27:**

హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల, మలి దశ తెలంగాణ ఉద్యమ అమరురాలు బెల్లి లలితక్క 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నివాళులు అర్పించారు. హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఆమె అమరత్వంతో తెలంగాణ ఉద్యమం మరింత బలపడిందన్నారు. మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ లలితక్క తెలంగాణ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారని, గుట్కా, సారా, వ్యభిచారం వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. జేఏసీ కో కన్వీనర్ డ్యాగల సారయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం లో హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ దండి లక్ష్మి, కౌన్సిలర్ గాదెపాక రవీందర్, సిద్దిపేట జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కేడం లింగ మూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, వంగ వెంకట్రాంరెడ్డి, గడిపే మల్లేష్,పందిళ్ల శంకర్, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి,బండి పుష్పరాజగోపాల్ రావు ,ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, నాంపల్లి సమ్మయ్య, వొసకుల సుధాకర్, ఏనుగు మల్లారెడ్డి, అబ్బరబోయిన రవీందర్, ఎదులాపురం తిరుపతి, రాంచంద్రం, మల్లికార్జునరెడ్డి ,కన్నోజు రామకృష్ణ, శేషు, రవీందర్ గౌడ్,భాస్కర్ నాయక్, మండల జంపన్న, మండల సురేందర్, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, మురళి,తొందూరి ఎల్లయ్య, ప్రవీణ్,కుమారస్వామి, రావుల రమేష్ ,జగదీశ్వర్, కొంరెల్లి, పత్తేం రమేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.




# పెద్దకోడెపాకలో అగ్నిప్రమాదం.

- పాఠశాల గది, వాహనాలు దగ్ధం - త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం.
- పంట అవశేషాలు కాల్చొద్దు - నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా.
- తహసీల్దార్ ప్రవీణ్ కుమార్.

**జనం వాయిస్, శాయంపేట, మే 27:**

శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. బలమైన గాలుల కారణంగా మండుతున్న మొక్కజొన్న సొప్ప నుంచి మంటలు వ్యాపించి రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయని తెలిపారు. అలాగే గ్రామ ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిలో కిటికీలు, బెంచీలు, తలుపులు, కొన్ని రికార్డులు కాలిపోయాయని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.





# నేరాల నియంత్రణ పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.

**- శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి.**

**జనం వాయిస్,శాయంపేట,మే 27 :**

ప్రజల భద్రత, నేరాల నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగే వివిధ సంఘటనల సమయంలో సీసీ కెమెరాల దృశ్యాలు నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సహాయపడతాయని వివరించారు. గ్రామస్థుల సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.సీఐ సూచనలపై వెంటనే స్పందించిన కొన్ని గ్రామాల సర్పంచ్‌లు, పాత సీసీ కెమెరాల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సీసీ కెమెరా టెక్నీషియన్ అనిల్‌కు నగదు అందజేశారు.గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెరుగుతుందని సీఐ తెలిపారు.



# బాలసదనం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.
- తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు చోటు లేదు.
- పెండింగ్ భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి.
- సుల్తానాబాద్ మండలంలోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**జనం వాయిస్, పెద్దపల్లి, మే 27:**

మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాల సదనం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్‌లోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాలసదనం ప్రారంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసదనం నిర్వహణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చిన్నారులకు సౌకర్యవంతమైన మరియు భద్రమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడి వసతులు, ఆహారం, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తదుపరి సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా ద్వారా వివిధ ధృవపత్రాల కోసం వచ్చే దరఖాస్తులను సకాలంలో స్క్రూటినీ పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రజలు తమ సమస్యలను నేరుగా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో బి.డబ్ల్యూ.ఓ. వేణుగోపాల్, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరొద్దీన్, తదితర అధికారులు పాల్గొన్నారు.



# నవభారత నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ.

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి.**

**జనం వాయిస్,శాయంపేట, మే 27 :**

ఆధునిక భారతదేశ నిర్మాణానికి మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ 17 ఏండ్లు దేశ ప్రధానిగా ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద పరిరక్షణ కోసం నెహ్రూ కృషి చేశారన్నారు. పంచశీల ప్రబోధకుడిగా, అలీనోద్యమ పితామహుడిగా, పంచవర్ష ప్రణాళికల ప్రాణదాతగా చరిత్ర సృష్టించాడన్నారు. నవభారతావనికి శాస్త్రీయ దృష్టి కల్పిస్తూ, శాస్త్ర, సాంకేతిక ప్రగతికి నెహ్రూ పునాదులు వేశారని, సాగునీటి ప్రాజెక్టులు, కర్మాగారాలు ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిన దార్శనికుడు నెహ్రూ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, డిసిసి ఉపాధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు చిందం రవి, డీటి రెడ్డి, మామిడిపల్లి సాంబయ్య, మారపల్లి కట్టయ్య, మసికే కుమారస్వామి, పల్లెబోయిన రాజు, వినుకొండ శంకరాచారి పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం.

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**

**జనం వాయిస్,శాయంపేట,మే 27:**

శాయంపేట మండలం పెద్దకొడేపాక గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు కుటుంబాలకు చెందిన ఇళ్లు, వరి గడ్డి, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో అబ్బు జనార్ధన్ రెడ్డి, అబ్బు రాజిరెడ్డి, అబ్బు మార్రెడ్డి కుటుంబాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి.విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదంలో జరిగిన నష్టంపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అగ్ని ప్రమాదానికి గల కారణాలపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఆర్ ప్రవీణ్ కుమార్,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ వేడుకలు.

## వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న కురుమ సంఘం మండల నాయకులు.

**జనం వాయిస్ కోహెడ, మే.27:**
కోహెడ:సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిధిలోని నకిరేకొమ్ముల గ్రామంలో శ్రీశ్రీ బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం వేడుకలు కురుమ సంఘం అధ్యక్షుడు గుడ్ల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా కురుమ సంఘం మండల అధ్యక్షులు చుక్క అశోక్,కురుమ సంఘం గౌరవాధ్యక్షులు తంగళ్ళపల్లి మాజీఎంపీటీసీ కోనే శేఖర్,కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ సిగిరి కొమురయ్యలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అతిధులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం అతిధులు మాట్లాడుతూ కురుమల అతి పెద్ద పండుగ తమ ఆరాధ్య దైవం బీరప్ప స్వామి అని తెలిపారు.బీరప్ప కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రతి 5సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గ్రామంలో గత వారం రోజులుగా పండగ వాతావరణంలో పోచమ్మ బోనాలు,రఘు బోనం,గంగ బోనం,లింగాలు తీయడంతోపాటు బిర్ల పూజారులతో వీరగంధ వేషధారణలతో గ్రామం మొత్తం ఆకట్టుకుంటుందన్నారు.లగ్గం బోనాలు ఊరేగింపుగా మహిళలంతా నెత్తి పైన బోనాలు ఎత్తుకొని బీర్ల డోలు నృత్యాలతో బీరప్ప గుడికి చేరుకొని మొక్కలు చెల్లించుకున్నారని చెప్పారు. బుధవారం నాగవెల్లి పట్నం,గురువారం ఎట్టి ముల్లెలు మోయడం శుక్రవారం రతి పోయడంతో పండుగ ముగుస్తుందన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామ కురుమ సంఘం సభ్యులపై,గ్రామస్తులందరిపైన బీరప్ప కామరాతి ఆశీస్సులు ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మహి, ఉపసర్పంచ్ సిరిగిరి వెంకటేష్,కురుమ సంఘం మండల ప్రచార కార్యదర్శి పరివేద సర్పంచ్ మీస కొమురయ్య,కోశాధికారి అమ్మ రాజ్ అనిల్,సంయుక్త కార్యదర్శి ఈరు రాజయ్య, డైరెక్టర్లు దయ్యాల రాజయ్య,గుడ్ల సమ్మయ్య,గుడ్ల అశోక్,గ్రామ కురుమ సంఘం నాయకులు గుడ్ల సారయ్య,గుడ్ల రామయ్య, గుడ్ల పెద్ద సమ్మయ్య,చిన్నసమ్మయ్య, గౌడ రవి,భక్తులు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.






# స్టెరాయిడ్స్ అధిక వినియోగంతో హిప్ జాయింట్లు దెబ్బతిన్న రోగికి మెడినోవా వైద్యులు విజయవంతమైన చికిత్స

## స్టెరాయిడ్స్ వినియోగంలో జాగ్రత్తలు అవసరం మెడినోవా వైద్యులు.

**మేడ్చల్ మే 27 (జనం వాయిస్):**
ఆధునిక వైద్య సేవలను మేడ్చల్ పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు మరో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. స్టెరాయిడ్స్ అధిక వినియోగం కారణంగా తుంటి భాగంలోని హిప్ జాయింట్లు దెబ్బతిన్న రోగికి చికిత్స అందించి తిరిగి సాధారణ జీవనానికి చేరుకునేలా చేశారు. హైదరాబాద్‌కు చెందిన 44 ఏళ్ల ఉమేష్ సింగ్ గత కొన్ని సంవత్సరాలుగా నడవడం, కూర్చోవడం, సాధారణ పనులు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన నడుము మరియు తుంటి భాగ నొప్పులతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు మేడ్చల్ పట్టణంలోని మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. రోగిని పరిశీలించిన ఆర్థోపెడిక్ మరియు జాయింట్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు డా.యు.కార్తిక్ పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ పరీక్షల్లో రెండు హిప్ జాయింట్లలో "అవాస్కులర్ నెక్రోసిస్" సమస్య ఉన్నట్లు గుర్తించారు. రక్త ప్రసరణ తగ్గిపోవడంతో ఎముక దెబ్బతినే ఈ సమస్య కారణంగా ఎడమ హిప్ జాయింట్ పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో దెబ్బతిన్న ఎడమ హిప్ జాయింట్‌ను తొలగించి ప్రత్యేక ఇంప్లాంట్ అమర్చే విధంగా అత్యాధునిక పద్ధతిలో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి ఐసీయూ పర్యవేక్షణ, నొప్పి నియంత్రణ చికిత్స, ఫిజియోథెరపీ మరియు ప్రత్యేక పోషకాహార సంరక్షణ అందించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి తిరిగి నడిచే స్థితికి చేరుకుని సాధారణ జీవనం కొనసాగిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డా.యు.



కార్తిక్ మాట్లాడుతూ, కోవిడ్ మహమ్మారి సమయంలో అధిక మోతాదులో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్య ఏర్పడి ఉండవచ్చని వివరించారు. స్టెరాయిడ్స్‌ను వైద్యుల సూచనల మేరకు మాత్రమే పరిమిత మోతాదులో వాడాలని ప్రజలకు సూచించారు. తుంటి భాగం, నడుము నొప్పులు వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదిస్తే సరైన నిర్ధారణతో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఇలాంటి ఆధునిక ఆర్థోపెడిక్ మరియు జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలు ఇప్పుడు మేడ్చల్‌లోనే అందుబాటులో ఉండటం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. గత రెండు మూడు సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులకు రోగి ఉమేష్ సింగ్ మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తీవ్రమైన నడుం నొప్పి కారణంగా ఉపాధి కోల్పోయిన తాను ఇప్పుడు మళ్లీ సాధారణ జీవితాన్ని ప్రారంభించగలుగుతున్నానని రోగి ఆనందం వ్యక్తం చేశారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు

## మంత్రి గడ్డం వివేకానంద. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి జైపూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం; రైతులు ఆందోళన చెందవద్దు: మంత్రి స్పష్టీకరణ.






**జనం వాయిస్, మంచిర్యాల, (మే 27):**
మంచిర్యాల,:ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, షెట్ పల్లి కొనుగోలు కేంద్రాలు, బాలాజీ, సుముఖ గోదాములు, ఇందారంలోని వరలక్ష్మి రైస్ మిల్‌లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజ రెడ్డిలతో కలిసి ఆయన సందర్శించి, కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి దిగుబడి 28 నుండి 32 క్వింటాళ్లకు పెరిగిందని పేర్కొన్నారు. సాధారణంగా జూన్ 6వ తేదీ వరకు జరిగే కొనుగోలు ప్రక్రియను, ఈ సంవత్సరం జూన్ 4వ తేదీ నాటికే 1 లక్ష 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంతో పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమంలో భాగంగా పెద్దపల్లి లో 2 గోదాములు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, పశ్చిమ బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పడిన హమాలీల కొరతను స్థానికులతో భర్తీ చేసి ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేశామని మంత్రి తెలిపారు. లారీల కొరత రాకుండా సింగరేణి సంస్థతో మాట్లాడి వాహనాలను సమకూర్చామని, అదనంగా 10 ఇసుక లారీలను సైతం ఏర్పాటు చేశామన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళనల వైపు రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా అందరూ రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పంట ఆలస్యంగా వస్తున్న ప్రాంతాల రైతులు ఆందోళన చెందవద్దని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, 500 సన్న రకం వడ్ల బోనస్, గృహ జ్యోతి వంటి పథకాల ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 36 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, పెద్దపల్లి, కరీంనగర్‌లలో హమాలీలతో కూడిన 2 గోదాములను కేటాయించారని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా, 35 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల జైపూర్ సుముఖ గోదాములో ధాన్యాన్ని భద్రపరుస్తున్నామని, అక్కడ 50 మంది హమాలీలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 62 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని, సంబంధిత రైతుల ఖాతాలలో 48 గంటలలోగా నగదు జమ చేయడం జరుగుతుందని, మరో 3 రోజులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మొక్కజొన్న పంట కొనుగోలు లక్ష్యం 8,700 మెట్రిక్ టన్నులు కాగా, ఇంకా 3 వేల మెట్రిక్ టన్నుల పంట సేకరించాల్సి ఉందని, అలాగే మరో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావలసి ఉందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత ముందుగానే పూర్తి చేసేందుకు రైస్ మిల్లులు, గోదాముల వద్ద పనులు వేగవంతం చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సానికి కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు.

- పది లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపిన ఏ.ఈ.
- కొన్ని గ్రామాల్లో కరెంట్ తీగల మీద పడిన రేకులు.
- ఎక్కడికక్కడ కుప్పకూలిన విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ఫార్మర్స్.

**జనం వాయిస్, మానకొండూర్, మే 27:**
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల వ్యాప్తంగా మంగళ వారం ఎరతేడపి లేకుండా కురిసిన గాలివాన కు మండల సెక్షన్ పరిధిలోనీ వెల్ది, లక్ష్మీపూర్, రంగపేట, ఊటూరు, లింగాపూర్, జగ్గయ్యపల్లి మరియు వేగురుపల్లి గ్రామాలలో గాలివాన బీభత్సానికి 11 కెవి లైన్ లో 58 పోల్స్ ఎల్.టి లైన్లో 33 పోల్స్ అలాగే 20 ట్రాన్స్ఫార్మర్స్ నేలమట్టం కావడం జరిగినది. వీటివలన సుమారు 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఏ.ఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం నుండే విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ లైన్స్ మర్మత్తులు, గాలికి పడిన చెట్లను, కరెంట్ తీగల మీద పడిన రేకులను సైతం తొలగిస్తూ క్షేతస్థాయిలో చాలా శ్రపడుతున్నట్లుగా, ప్రజల సౌకర్యార్థం తర్వగతిన పనులు పూర్తి చేసి పైన పేర్కొన్న గ్రామాల్లో మర్మత్తులు చేసి విద్యుత్ ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, మే (జనం వాయిస్):**
మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి సహకారంతో మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన వాకిటి సాయి కుమార్ కి మంజూరైన రూ.60,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ పేద మరియు అవసరమైన కుటుంబాలకు ఆర్థికంగా గొప్ప ఊరటనిస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అందిస్తున్న ఈ సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇలాంటి పథకాలు సమాజంలోని బలహీన వర్గాలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# జల దోపిడిలో భాగమే లిఫ్ట్ కుట్రలు.

## జీవో 98ని తక్షణమే రద్దు చేయాలి. కమీషన్ల కోసమే మున్నేరు పాలేరు లింక్ కెనాల్. విశ్వ జంపాల,తెలంగాణ విద్యావతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు.

**గార్ల /జనం వాయిస్ :**
గార్ల మండలాన్ని ఎడారిగా మార్చే ప్రతిపాదిత మున్నేరు పాలేరు లింకు కెనాల్ కు అనుకూలమని పేర్కొంటూ, మండల సాగునీటి అవసరాల కోసం మున్నేరుపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేక ఇవ్వడం గార్ల మండల ప్రజలను, రైతులను మాయ మాటలతో మభ్య పెట్టడానికేనని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల అన్నారు.ఈ మెరకు బుధవారం మండల కేంద్రంలో మీడియాకు విశ్వ జంపాల ఒక ప్రకటన విడుదల చేశారు.మున్నేరు పాలేరు లింకు కెనాల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మండలంలో కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలను నీరుగార్చే కుట్రలో భాగంగానే ఈ లేఖలు ముందుకొస్తున్నాయని ఆయన ఆరోపించారు.మండలంలో పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులు ఏకమై మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ కు వ్యతిరేకంగా చారిత్రాత్మక ఉద్యమం చేస్తుంటే, ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రజా నిరసనల తీవ్రతను పక్కదారి పట్టించడానికి, ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి 'లిఫ్ట్ ఇరిగేషన్' అనే కొత్త రాగాన్ని అందుకున్నారని పేర్కొన్నారు.నేటి ప్రభుత్వాలు చిన్నచిన్న లిఫ్టులను సహితం నిర్వహించలేని పరిస్థితిలో ఉండడం కారణంగా ఇక్కడి రైతాంగం సాగునీటి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. పడావుపడ్డ లిఫ్టులను పట్టించుకోని ప్రభుత్వాన్ని కొత్త లిఫ్ట్ లను ఏర్పాటు చెయ్యమని కోరడం మండల ప్రజలను ఏమార్చి మున్నేరు నీళ్లను ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రయత్నించడమేనని ఆయన అన్నారు.మండల ప్రజల ఆస్తి, ప్రాణ, పర్యావరణ నష్టానికి కారణమయ్యే మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్ట్ వల్ల స్థానిక ప్రాంతానికి వచ్చే లాభం 'సున్నా',కానీ జరిగే నష్టం 'అనంతం'. ప్రజా ప్రతినిధులు కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా, స్థానిక రైతాంగ ఆకాంక్షల కోసం పనిచేయాలని కోరారు.



# రైలులో చోరీ నిందితుల అరెస్టు

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి (మే 27):**
రైలులో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను రైల్వే రక్షక దళ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 25న రైలులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎండి. రేహాన్, రాఘవేంద్ర, వెంకటేశ్వర్లుతో పాటు కొందరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, తామే రైలులో దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుండి బంగారు చెవి కమ్మలు, 6 ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికులు తమ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.




# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
జూన్ రెండవ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ సూచించారు, బుధవారం కలెక్టరేట్ అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలలో ప్రోటోకాల్ ప్రకారం అతిధులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పురోగతిపై ప్రసంగం కాపీని సిద్ధం చేయాలని, వేదిక, సీటింగ్, స్నాక్స్, సౌండ్స్, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు, ట్రాఫిక్ సమస్యలు ఇతర ఇబ్బందులు లేకుండా పోలీస్ విభాగం చర్యలు తీసుకోవాలని, వేదిక ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, త్రాగునీరు సిద్ధంగా ఉంచాలని, సానిటేషన్ చేయాలని సూచించారు, సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేయాలన్నారు, ఈ సమావేశంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు, సెక్షన్ సూపర్డెంట్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఎగుమతి దిగుమతి లో హమాలి కార్మికులే కీలకం

**హమాలి కార్మికుల శ్రమను దోచుకుంటున్న పాలకులు.**
**ఈనెల 30న జనగామలో హమాలీ నాల్గవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి.**
**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న.**

**మే 27 జనం వాయిస్, పాలకుర్తి:**

అన్ని రకాల సరుకులు ఎగుమతి దిగుమతిలో కీలక పాత్ర పోషించే హమాలి కార్మికుల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న విమర్శించారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలో హాల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు, నాల్గవ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమన్న పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, హమాలీ కార్మికుల సమస్యలు సాధనకై కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. హమాలీ కార్మికులు నిత్యం శ్రమిస్తున్న చాలీచాలని కూలీలతో దుర్భర జీవితాలతోనే కాలం వెలదీస్తున్నారని తెలిపారు. కూలీతో వారి కుటుంబాలు గడవడం అసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు, హమాలీ కార్మికులకు కనీస వేతనాల చట్టాలు లేవని వారి సంక్షేమం కోసం పాలకులు ఏమాత్రం పనిచేయడం లేదని విమర్శించారు, హమాలీ కార్మికులు ప్రమాదంలో చనిపోతే ప్రభుత్వం వారి కుటుంబానికి భరోసాగా పది లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలన్నారు, రాష్ట్రంలోని హమాలీల సమస్యల పైన చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించడానికి ఈ నెల 30న జనగామలో హాల్ హమాలి వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పెండ్లి భాస్కర్, తోటరాజు, పరశురాములు, ఏ సమ్మయ్య, కత్తుల అశోక్, దండిగా పెద్దపురం, రాచర్ల రాజు, సారయ్య,ఉప్పలయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



# హోంగార్డ్ ఉపేందర్‌కు ఘన వీడ్కోలు

**మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం.**

**మహబూబాబాద్ / జనం వాయిస్:**

మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖలో దీర్ఘకాలంగా నిబద్ధతతో సేవలందించిన హోంగార్డ్ బి. ఉపేందర్ పదవీ విరమణ పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఉపేందర్ ని శాలువాతో సత్కరించి, పోలీస్ శాఖకు అందించిన విశిష్ట సేవలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీస్ శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజా భద్రత, విధి నిర్వహణలో వారి సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. బి. ఉపేందర్ గారు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి సహచరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్ పాల్గొని ఉపేందర్ సేవలను స్మరించుకున్నారు. పోలీస్ శాఖలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో ఉపేందర్ గారి కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపేందర్ భావోద్వేగానికి గురై, తనకు సహకరించిన జిల్లా పోలీస్ శాఖ అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



# పెంకు కార్మికుల వేతనాల పెంపుదలకై పోరాడుదాం

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా.**

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**

పెంకు కార్మికుల సమస్యల పరిష్కారం, వేతనాల పెంపుదల కోసం ఐక్యంగా పోరాడాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తపేటలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం వై బాబుల శ్రీను, బుగ్గ రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ దేశంలో అసంఘటిత రంగ కార్మికులు కోట్ల సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి తగిన వేతనాలు, సంక్షేమ సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంకు కార్మికులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నప్పటికీ సరైన వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెంకు కార్మికుల వేతనాలు పెంచే వరకు ఉద్యమాలు, పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎస్.కె మదర్, రామ్ సింగులు అవినీతి, అక్రమాలకు పాల్పడిన కారణంగా తెలంగాణ టైల్ వర్కర్స్ యూనియన్ నుంచి తొలగించామని, వారికి ఐఎఫ్టియూతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక..,**

తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వై బాబుల శ్రీను, కార్యదర్శిగా నెల్లూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.కె పాషా, ఎన్ కోటయ్య, సహాయ కార్యదర్శులుగా పి సాంబయ్య, బుగ్గ రవి, కోశాధికారిగా వంగూరి వెంకన్నతో పాటు మరో 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# రాత్రి పహారా విస్తృతంగా నిర్వహించాలి

**రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్.**

**మహబూబాబాద్ / జనం వాయిస్:**

రాత్రి పహారా విస్తృతంగా నిర్వహించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించిన ఎస్పీ, దూర ప్రాంతాల నుండి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు ప్రస్తుత ఎండ తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ, యువతను గంజా వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో రాత్రి పహారా (నైట్ పట్రోలింగ్) విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే తమ పరిధిలో ఉన్న హోటల్స్, లాడ్జిలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. గంజా వంటి మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గంజా సంబంధిత సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ అంజలి, ఎస్సై, సిబ్బంది ఉన్నారు.



# రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో కరీంనగర్ డెయిరీ.

**వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకోవాలి.**
**పాల సేకరణ కంటైనర్ ప్రారంభోత్సవంలో డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు.**

**జనం వాయిస్ కోహెడ, మే .27:**

కోహెడ:పాడి రైతుల సంక్షేమంతోపాటు పాల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో కరీంనగర్ డెయిరీ నిలిచిందని ఆ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు తెలిపారు.బుధవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం చంద్ర నాయక్ తండాలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాల సేకరణ కంటైనర్ ప్రారంభోత్సవానికి చైర్మన్ రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు రైతులు పాడి పరిశ్రమను పెంపొందించుకున్నట్లయితే మరింత ఆర్థిక అభివృద్ధి చెందే అవకాశం ఉందని రైతులకు వివరించారు.రైతుల నుండి నాణ్యమైన పాలను సేకరిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నట్లు చెప్పారు.కరీంనగర్ డెయిరీ పాడి రైతుల సంస్థ అని,పాల ఉత్పత్తుల ద్వారా వచ్చే ప్రతి రూపాయి పాడి రైతులకు చెందే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్ డెయిరీలో అవినీతి అక్రమాలకు ఎక్కడ చోటు లేదని, అవినీతి జరిగితే ప్రశ్నించే హక్కు పాడి రైతులకు ఉందని వారు స్పష్టం చేశారు.ప్రతి ఇంటికి ఒక గేదెను తప్పకుండా పెంచుకోవాలని,ఆ పాలతో ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.పాల ఉత్పత్తిదారులకు కరీంనగర్ డెయిరీ ఎప్పుడు అండగా ఉంటుందని,పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా 23రకాల సంక్షేమ పథకాలతో విజయవంతంగా ముందుకు వెళుతుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల బాబురాజు,హుస్నాబాద్ మేనేజర్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఉపసర్పంచ్ గొండా నర్సింగరావు,పాలకేంద్రం అధ్యక్షులు బానోతు సంపత్ నాయక్,డెయిరీ సూపర్వైజర్ సిర్ర కరుణాకర్ రెడ్డి,మాజీఎంపీపీ కొప్పుల కీర్తి సురేష్,మాజీ ఎంపీటీసీ కొక్కుల రమేష్, పాలకేంద్రం డైరెక్టర్లు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# వాస్తవ సాగు ఖర్చుల ఆధారంగా ఎంఎస్పి ప్రకటించాలి

**ఎస్కేఎం జిల్లా కన్వీనర్ గుజ్జు దేవేందర్.**

**మహబూబాబాద్ / జనం వాయిస్:**

వాస్తవ సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధర ( MSP) ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) జిల్లా కన్వీనర్ కామ్రేడ్ గుజ్జు దేవేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమామిళ్ల జగన్నాథం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా మహబూబాబాద్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం కామ్రేడ్ నల్లపు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026-27 సంవత్సరానికి ప్రకటించిన పంటల మద్దతు ధరలు రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరిచాయని విమర్శించారు. డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం MSP అమలు చేస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి రాకముందు బీజేపీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే రైతులు 13 నెలలపాటు ఢిల్లీ కేంద్రంగా చేసిన ఉద్యమం తర్వాత కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీల్లో ఒక్కటినీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, యూరోప్ యూనియన్లతో కుదుర్చుకున్న అసమాన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, భారత వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు నివారించాలంటే వాస్తవ సాగు ఖర్చుల ఆధారంగా MSP లెక్కించి డాక్టర్ స్వామినాథన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేకపోతే రైతాంగాన్ని పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమాలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2026-27 మద్దతు ధరల పత్రాలను మే 27 నుంచి 29 వరకు గ్రామ గ్రామాల్లో దగ్ధం చేయాలని, మే 30న జిల్లాలోని 18 మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మే 31న మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు, రైతు-కూలీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్కేఎం జిల్లా కన్వీనింగ్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ శెట్టి వెంకన్న, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గోనిగంటి రాజన్న, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు, నాయకులు దంతూజు ఉపేంద్రచారి, కామ్రేడ్ నల్లపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిష్కరించాలి

**100 రోజుల పనులు, గ్రామీణ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి మంత్రి సీతక్క.**

**మహబూబాబాద్ / జనం వాయిస్:**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడ మండలం ఓటాయి గ్రామం, కొత్తగూడ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డీఓ క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం తదితర జిల్లా ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింత చేరువ చేయడమే ప్రజా దర్బార్ ఉద్దేశమన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రూ.60,400 కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా



సంఘాల్లో సభ్యులైతే అదనంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల ఉపాధి హామీ పనుల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సీసీ రోడ్లు, చెక్‌డ్యామ్‌లు, అంతర్గత రహదారుల నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణంలో ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్న మంత్రి, ఇప్పటికే మండల పరిధిలో 40 భవనాలకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. అలాగే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తున్నామని చెప్పారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతోందని, జిల్లాకు కేటాయించిన కోటాకు అదనంగా మరో 2 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇండ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్న కుటుంబాలకు ప్రైవేట్ సంస్థల ద్వారా ఇండ్లు నిర్మించి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఆసరా పెన్షన్లు, భూమి సమస్యలు, రేషన్ కార్డులు, గ్రామీణ రహదారులు, తాగునీరు, ఆరోగ్య సహాయం తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. మంత్రి సీతక్క స్వయంగా ప్రజల సమస్యలను ఓపికగా విని, కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు బదిలీ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. చెక్‌డ్యామ్‌లు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, గ్రామీణ అంతర్గత అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం కొత్తగూడ మండల పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి సన్మానించారు. బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఓటాయి గ్రామంలో 167, కొత్తగూడ రైతు వేదికలో 142 దరఖాస్తులు అందగా, మొత్తం 309 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వాటి పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి సంబంధిత శాఖలకు పంపించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదనరాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో మునవర్ బేగ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా గర్రెపల్లి సత్యనారాయణ

**జనం వాయిస్, మంథని, మే 27:**



భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా గర్రెపల్లి సత్యనారాయణను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గర్రెపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మరింత బాధ్యత పెంచిందని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన తెలిపారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులకు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశ్విని కుమార్, ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్ర బోస్, జాతీయ వ్యవహారాల అధ్యక్షుడు రామ్ రాజ్, జాతీయ యువజన విభాగం అధ్యక్షుడు దిలీప్ కుమార్ శర్మ, అడ్వైజరి కమిటీ సభ్యులు చిన్మయ చారి అభినందనలు తెలిపారు.

RNI NO:TGTEL/26/A0383
దినసరి జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# మృతుడి కుటుంబానికి రూ.55 వేల ఆర్థిక సహాయం అందజేత

- కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ రఘు.
- రూరల్ సీఐ అంజలి, కురవి ఎస్సై సతీష్ చేతుల మీదుగా సహాయం అందించిన రఘు.

**కురవి / జనం వాయిస్:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన ముద్రకోల సురేష్ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ రఘు మానవత్వాన్ని చాటుకున్నారు. తన ఫాలోవర్స్, దాతల సహకారంతో సురేష్ కుటుంబ సభ్యులకు రూ.55 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయాన్ని మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజలి, కురవి ఎస్సై సతీష్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. మృతుడు సురేష్‌కు 45 రోజుల పసిపాపతో పాటు ఇద్దరు కుమారులు ఉండటంతో కుటుంబ పరిస్థితి స్థానికులను కలచివేసింది. ఆపదలో ఉన్న కుటుంబానికి ఎలాంటి ఆలస్యం చేయకుండా స్పందించిన రఘును రూరల్ సీఐ అంజలి, ఎస్సై సతీష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధువులు రఘుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీ కానిస్టేబుళ్లు అనిత, పుష్ప, బండారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# రైతులను గాలికి వదిలేసిన ప్రభుత్వం

**వరి ధాన్యం కొనుగోళ్లపై మొద్దు నిద్ర. ప్రశ్నించిన రైతులపై అక్రమ కేసులు. రైతు గోస బీజేపీ భరోసా పర్యటనలో బి జె ఎల్ పి నేత మహేశ్వర్ రెడ్డి.**



**జనం వాయిస్, మంథని:**

మంథని: రైతుల పండించిన వరి, మక్కలు, శెనగలు, కందులు కొనుగోళ్లను ప్రభుత్వం గాలికి వదిలేసిందని డీజే ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల కోసం బిజెపి భరోసా పర్యటనలో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పెద్దపెల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 80 శాతం కొనుగోలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికి గ్రౌండ్ లెవెల్ మాత్రం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో లక్షల కొద్ది క్వింటాళ్ల వారి ధాన్యం కుప్పలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. సహచర మంత్రి శ్రీధర్ బాబు సొంత నియోజకవర్గం లో సైతం మూడు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి కేంద్ర కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి లారీల కొరత తీవ్రంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులను విస్మరించిందని ధ్వజమెత్తారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చెయ్యకపోతే బిజెపి తరఫున నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు పైన శ్రద్ధ వహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్ల నారాయణరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొండపాక సత్య ప్రకాష్, బిజెపి మహిళా నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, చంద్రు పట్ల కీర్తి రెడ్డి, కందుల సంధ్యారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, జిల్లా కార్యదర్శి గట్టయ్య, కౌన్సిల్ సభ్యులు బోగోజు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, నాయకులు మారం శ్రీనివాస్, రాపర్తి సంతోష్, కొయ్యడ సతీష్, చిలువేరి సతీష్, కొండ లక్ష్మణ్, నాంపల్లి రమేష్, నారమల్ల కృష్ణ, బూడిద తిరుపతి, మల్లేష్, సదానందం, దేవేందర్, రాజు, శంకర్, చాంద్ పాషా, లక్ష్మణ్, సామల అశోక్, ఎడ్ల సాగర్, బొల్లంపల్లి లక్ష్మణ్, ఆకుల అరుణ్, విష్ణు, శ్రీరామోజి లక్ష్మణ్, గుడ్ల గురవేష్, తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**జనం వాయిస్, బెజ్జంకి:**

బెజ్జంకి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ శాసనసభ్యులు, డా. రసమయి బాలకిషన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. "ప్రజల కోసండ ప్రజల మధ్యలోనే బీఆర్ఎస్" అంటూ నాయకులు నినాదాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఈర్ల సమ్మయ్యకు సన్మానం

**పెద్దపెల్లి, జనం వాయిస్:**



కరీంనగర్ కళాభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన పెద్దపెల్లి జిల్లా, కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు ఘన సన్మానం జరిగింది. ఈనెల 26న తెలంగాణ రాష్ట్ర స్థాయి లఘు చిత్ర నిర్మాతల మండలి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, కళాకారుడు కనపర్తి శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు జరిగాయి. ఇందులో బహు భాషా గాయకుడు డాక్టర్ కె.జె ఏసుదాసు పాటలపై రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఈర్ల సమ్మయ్యను నిర్వాహకులు శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో పాల్గొనడం గొప్ప అనుభూతిని మిగిల్చిందని ఈర్ల సమ్మయ్య తెలిపారు.

# వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- వి.బి.జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్.
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య.

**కురవి / జనం వాయిస్ :**

మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ బుధవారం కొప్పెర రామన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులు మరియు గ్రామీణ పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.12,000 అందించాలని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని కోరారు. అలాగే వృద్ధాప్య, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత మరియు గీతా కార్మికులకు ప్రస్తుతం ఉన్న పెన్షన్‌ను రూ.2,016 నుండి రూ.4,016లకు పెంచాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిదినాలను 150 రోజులకు పెంచి, రోజువారీ కూలీని రూ.600గా నిర్ణయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి రాంజీ పథకాన్ని వెంటనే రద్దు చేసి, 2005లో అమల్లోకి వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు స్పందించకపోతే గ్రామీణ పేదలను సమీకరించి ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం నూతన 11 మంది మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పెర రామన్న, ప్రధాన కార్యదర్శిగా తగరం తిరుపతి, ఉపాధ్యక్షులుగా పెద్ది లలిత, బిజినబోయిన బుచ్చమ్మ, ముడుసు కవిత, ముడుసు భారత, చల్ల సైదమ్మ, జనగాం రమ తదితరులు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న, గొడిశాల వెంకన్న పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పూలెపాక గణేష్, బాలు నాయక్, గుంపు మేస్త్రీలు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.




# రూపాయి పతనంతో విదేశీ విద్యార్థుల బతుకు భారం

**కప్పాటి పాండురంగా రెడ్డి**

**ఒక పూట భోజనం.. కిలోమీటర్ల నడక.. విదేశాలలో భారతీయ విద్యార్థుల దీనావస్థ పట్లపాండురంగా రెడ్డి ఆవేదన.**

డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి విలువ నానాటికీ క్షీణించడం కేవలం చమురు దిగుమతులు, స్టాక్ మార్కెట్లు, దేశ వాణిజ్య లోటుకు మాత్రమే పరిమితమైన అంశం కాదని, ఇదివిదేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న లక్షలాది మంది భారతీయ విద్యార్థుల జీవితాలను చీకట్లోకి నెడుతోందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై చదువుకుని, కుటుంబాలకు అండగా నిలవాలని ఎన్నో ఆశలతో వెళ్లిన సామాన్య, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి నేడు చదువు కంటే.. 'రోజు ఎలా గడవాలి? మనుగడ ఎలా సాగించాలి?' అనే దైన్య స్థితికి చేరుకోవడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, రూపాయి బలహీనపడటంతో విదేశాల్లో జీవన వ్యయం (జశీర్ శీట ాఅజఅఅస్త్ర) భరించలేనంతగా పెరిగిపోయిందన్నారు. భారతదేశం నుండి తల్లిదండ్రులు పంపే డబ్బు అక్కడి కనీస అవసరాలకు కూడా ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత సంపన్న కుటుంబాల పిల్లలు మినహా, మిగిలిన సాధారణ విద్యార్థులంతా రోజువారీ బడ్జెట్ కోసం తీవ్రంగా పోరాడాల్సి వస్తోందని ఆయన వివరించారు.

విద్యార్థుల దీన స్థితిని వివరిస్తూ ఆయన కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు:

ఒక పూట భోజనంతోనే సరి: ఖర్చులు తగ్గించుకోవడానికి విద్యార్థులు రోజుకు ఒక పూట మాత్రమే తింటూ, కొన్నిసార్లు అసలు భోజనాన్ని కూడా మానేస్తూ లంకణాలు ఉంటున్నారు. బస్సు, సబ్‌వే ఛార్జీలు కూడా భరించలేని స్థితిలో, నిత్యం కిలోమీటర్ల కొద్దీ కాలినడకన ప్రయాణిస్తూ విద్యార్థులు శారీరకంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. కేవలం మనుగడ కోసం అధికారిక పార్ట్-టైమ్ షిఫ్ట్‌లతో పాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లు, రైల్వే స్టేషన్లలో ఫ్లోర్‌లు తుడవడం వంటి ఎంతో కష్టతరమైన పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆకలితో అలమటిస్తూ, కేవలం బతుకుదెరువు కోసమే నిరంతరం పోరాడుతున్న విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడం సాధ్యం కాదన్నారు. ఈ మానసిక, శారీరక ఒత్తిడి వారి ఆరోగ్యాన్ని క్షీణింపజేయడమే కాకుండా.. వారి విద్యా నైపుణ్యాలను, గ్రేడ్‌లను కూడా దారుణంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ గర్వకారణంగా ఎదగాల్సిన యువత, విదేశాల్లో కనీస అవసరాల కోసం అల్లాడిపోవడం దేశానికే నష్టమని హెచ్చరించారు.

డాలర్‌తో రూపాయి పతనాన్ని కేవలం ఆర్థిక గణాంకాల కోణంలోనే చూడకుండా, దీని వెనుక ఉన్న మానవీయ కోణాన్ని, విద్యార్థుల దీన పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా రంగ నిపుణులు తక్షణమే స్పందించి ఈ సంక్షోభంపై దృష్టి సారించాలని, విదేశాల్లోని భారతీయ విద్యార్థులకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు లేదా ప్రత్యేక స్కాలర్‌షిప్ మార్గాలను పరిశీలించి ఆదుకోవాలని కప్పాటి పాండురంగా రెడ్డి ఈ ప్రకటన ద్వారా ప్రభుత్వాలను కోరారు.



కప్పాటి పాండురంగా రెడ్డి
రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ, పూర్వ చైర్మన్
టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు.

# పంట అవశేషాలను కాల్చి రైతులు ఇబ్బందులకు గురి కావద్దు

**నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్**

**కురవి / జనం వాయిస్ :**

పంట అవశేషాలు కాల్చి రైతులు అనవసరంగా ఇబ్బందులకు గురికావద్దని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నరసింహారావుతో కలిసి పరిశీలించి రెండు, మూడు రోజులలో మొత్తం ధాన్యం మిల్లులకు తరిలించే విధంగా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని, నిర్వాహకులను కోరారు, రైతులతో మాట్లాడుతూ పత్తి, వరి, మొక్కజొన్నలాంటి ఇతర పంటల అవశేషాలను రైతులు అవగాహన లోపంతో కాల్చడం వల్ల భూసారము దెబ్బతిని, ఉపయోగపడే అనేక సూక్ష్మజీవులు చనిపోవడంతో ఎన్ని మందులు వేసిన పంట దిగుమతి రాదని, అంతేకాకుండా కాల్చడం వలన పక్కనే ఉన్న ఇతర పంటలు కాలిపోతున్నాయని, మోనో కార్బన్డయాక్సైడ్ విడుదల కావడంతో దానిని నిలిచిన పక్క రైతులు ఊపిరాడక అనేక ప్రాంతాల్లో చనిపోవడం తో అనేక నష్టాలు ఉన్నందున ఉన్నందున పర్యావరణ చట్ట ప్రకారం జరిమానాలు, జైలు శిక్షలతో రైతులు ఇబ్బందుల పాలుకాకుండా,పంట అవశేషాలను భూమిలోనే కలియ దున్నడంతో అనేక ఉపయోగాలు కలుగుతాయని అన్నారు. ఈ సీజన్లో యూరియా వాడకం తగ్గించి జింక్, పొటాషియం లాంటి సూక్ష్మ పోషకాలు ఎక్కువ మోతాదులో వాడి భూమిని సారవంతంగా ఉంచుకొని అధిక దిగుబడి పొందవచ్చును కోరారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర బాధ్యులు శ్రీపాల్ ,సంగేశీ రమ,రేణుక, పద్మ, బొల్లం ఉప్పలయ్య, బత్తిని నర్సయ్య, వెంకటయ్య అప్పాల వెంకన్నలు పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**చివరి గింజ వరకు కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి సమీక్ష.**



**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి (మే 27):**

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సైతం పూర్తి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్ లో తెలంగాణ దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిందని.. ఇప్పటివరకు 8.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 10,096 కోట్ల నగదు జమ చేశామని, మిగిలిన 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా యుద్ధప్రాతిపదికన సేకరిస్తామని మంత్రి తెలిపారు. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యం తడవగా, అందులో 8,833 టన్నులను ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి పేర్కొన్నారు. ధాన్యం రవాణాలో లారీల కొరత రాకుండా ఇసుక, సిమెంట్ లారీలను మళ్లించాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, ధాన్యం సేకరణపై పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులను గోదాములుగా మార్చే అవకాశాలను పరిశీలిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 62 శాతం వివరాలను ట్యాబులలో నమోదు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, డీఆర్‌డీఓ కిషన్, వ్యవసాయ అధికారి సురేఖ తదితరులు పాల్గొన్నారు

